వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

గురువారం 03 నవంబర్ 2022

జిల్లా వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు

కడప లీగల్, నవంబరు 2, ప్రభాతవార్త:

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి ఆదేశానుసారం స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సందర్భంగా గత నెల 31 నుంచి ఈనెల 13 వరకు పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఎస్.కవిత తెలిపారు. బుధవారం మహిళా కేంద్ర కారాగారం, రామాంజనేయపురం, చలమారెడ్డిపల్లి, వైఎస్ఆర్ సర్కిల్, తిలక్‌నగర్, గురుకుల పాఠశాల, చిన్నచౌకు, ప్రకాష్‌నగర్, అంగడివీధి, ఇందిరా నగర్ తదితర 15 ప్రాంతాల్లో 560 మందికి ఇంటింటి న్యాయ ప్రచారం మరియు 17 ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి చట్టాల పట్ల, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాల పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు, లా విద్యార్థినీ విద్యార్థులు, ఎన్‌జీవోలు, అంగన్‌వాడీ వర్కర్లు, ప్రిన్సిపల్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, ప్యానెల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వర్షపు నీటికి దారెటు

రాయచోటి టౌన్.నవంబర్ 02 ప్రభాతవార్త

జిల్లా కేంద్రయిన రాయచోటి పట్టణం మున్సిపాలిటి పరిధిలోని రహదారులపై నిలువ ఉన్న వర్షపు మురుగు నీరు ఎటు వెళ్తాయని పలువురు చూపరులు ముక్కున వేలు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఎక్కడో కాదు, కొత్తపేటలోని విఆర్ స్కూల్ లైన్ నందు స్కూల్ విద్యార్థులు మురికి నీరు ఉండటంతో దారి లేక ఆ మురికి నీటిలోనే విద్యార్థులు స్కూల్‌కి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు మాత్రమ పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే కొత్తపేట మెయిన్‌రోడ్డుపైన ఇదే పరిస్థితి నెలకొంది. మదనపల్లె రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించిన వర్షపు నీరు మాత్రం రోడ్లపైనే నిలబడి ఉన్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేయనటువంటి పరిస్థితి లక్షల వ్యయంతో నిర్మించిన కాలువలు రోడ్డుకు ఇరువైపులా అలంకార ప్రాయంగానే ఉన్నాయి తప్ప ఆ కాలువలు వల్ల ఎటువంటి ఉపయోగం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డుపైన ఉన్నటువంటి నీటిని తొలగించి ప్రయాణికులుకు విద్యార్థులుకు ఇబ్బంది లేకుండా వెంటనే వర్షపు నీరును తొలగించే మార్గాన్ని చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కేసులు తక్కువ ... వసూళ్లు ఎక్కువ ..

ఓవర్ లోడ్‌కు నెల మామూళ్లు! - వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్‌లు

మైదుకూరు ఘటనే నిదర్శనం - ఫిట్‌నెస్‌లకు తూట్లు - ప్రభుత్వ ఆదాయానికి గండి

బద్వేలు, నవంబరు 02 ప్రభాతవార్త :

బద్వేలు రవాణా శాఖ పరిధిలో కేసులు తక్కువ... వసూళ్లు ఎక్కువ .. అన్న చందంగా మారింది. నిరంతరాయంగా బద్వేలు మీదుగా వెళుతున్న ఓవర్ లోడ్ వాహనాలపై కేసులు రాయకుండా కేవలం మామూళ్ళతోనే ఆ అధికారి సరిపెట్టుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇసుక రవాణా చేసే వాహనాలు అధిక లోడుతో వెళుతున్నా పట్టించుకోకుండా మామూళ్లు వసూలు చేస్తున్నారనే వార్త బద్వేలు, పోరుమామిళ్ళ, మైదుకూరులో దావణంలా వ్యాపించింది. అంతే కాకుండా బద్వేలు నుండి రవాణా అయ్యే ఇతర వాహనాలు కూడా ఓవర్ లోడ్‌తో వెళుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే అప్పుడు హడావిడిగా స్పందించడం జరుగుతుందని పలువురు అంటున్నారు. ఇదిలా ఉంటే ఆటోల డ్రైవర్లు విద్యార్థులను, ప్రయాణికులను, కూలీ పనులకు వెళ్ళే వారిని అనుకున్న కెపాసిటీ కంటే ఎక్కువ మందిని తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. నెల మామూళ్ళ ద్వారా నిబంధనలు నీళ్లు వదిలినట్లు సమాచారం. వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్‌లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో ఇన్సూరెన్స్‌లు నకిలీ చేయడం వలన ఈ రోజు ప్రమాదాలు జరిగినా ఎటువంటి భరోసా లేకుండా పోతోంది. ఇందుకు నిదర్శనం మైదుకూరులో స్కూల్ బస్సు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు మృతిచెందిన విషయంలో బస్సుకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో భరోసా లేకుండా పోయింది. అలాగే బద్వేలు రవాణా శాఖ పరిధిలో అనేక నకిలీ ఇన్సూరెన్స్‌లు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. వీటిపైన అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ఏదైనా సంఘటన జరిగినపుడు మాత్రమే బయటికి వస్తున్నాయి. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసినపుడే ఇన్సూరెన్స్‌ల బాగోతం బయటపడే అవకాశం లేకపోలేదు. ఫిట్‌నెస్ విషయంలో కూడా నిర్లక్ష్యంగా ఉన్నట్లు కనపడుతుంది. ముఖ్యంగా స్కూల్ బస్సులు, ఇతర వాహనాలకు సరైన ఫిట్‌నెస్ లేకపోయినా అధికారులు మామూళ్లు తీసుకొని బయటికి పంపుతుండటంతో ప్రమాదాలు జరిగినపుడు మాత్రమే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అలా కాకుండా నిర ంతరాయంగా వీటిపైన నిఘా ఉంచితే ఇన్సూరెన్స్‌లు, ఫిట్‌నెస్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు సక్రమంగా ఉన్నాయో, లేదో తెలుస్తుంది. స్కూల్ బస్సుకు డ్రైవర్‌గా వెళ్ళాలంటే అనుభవం కలిగి ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ డ్రైవర్లు మారుతుండడం, స్కూల్ బస్సు యజమానులు మొదటగా అనుభవం కలిగిన డ్రైవర్‌తో మాట్లాడుకొని ఎక్కువ జీతం ఇస్తూ మధ్యలో వారిని తీసివేసి తక్కువ జీతానికి అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడిపిస్తూ ప్రమాదాలు జరిగే పరిస్థితికి తీసుకువస్తున్నారు. ఇదంతా పర్యవేక్షించాలని బద్వేలు రవాణా శాఖ అధికారి నిర్లక్ష్యంగా ఉండడం వల్లే జరుగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో బద్వేలు పరిధిలో ఒక ప్రైవేట్ స్కూల్ వాహనానికి నకిలీ ఇన్సురెన్స్ కలిగి ఉండడంతో వాహనం కింద పడి పిల్లవాడు చనిపోతే ఆ కుటుంబానికి భరోసా లేకుండా పోయింది. ఇటువంటి సంఘటనలు అక్కడక్కడా జరిగినప్పుడు మాత్రమే ఇన్సురెన్స్‌ల బాగోతం బయటపడుతున్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి :

ప్రభుత్వానికి రావాలిసిన నిధిని ఆ అధికారి గండి కొడుతున్నట్లు బద్వేలులో చర్చించుకుంటున్నారు. కేసులు రాయకుండానే వాహనదారుల నుండి మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వాహనదారుడు ఎంత ఓవర్ లోడ్‌తో వెళ్ళినా పట్టించుకోకుండా ప్రతి నెలా మామూళ్ళకే పరిమితమయ్యారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఒక్కొక్క రూట్ లో ఒక వ్యక్తిని నియమించుకొని వసూళ్ళపై దృష్టి పెట్టారని సమాచారం. ఈ మధ్య కాలంలో తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వ ఆదాయానికి నిధి సమకూరడం లేదనే వార్త కూడా వినపడుతుంది. ఏది ఏమైనా బద్వేలు రవాణా శాఖలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నట్లు సమాచారం. నిబంధనలు పాటించకుండా కేవలం నామమాత్రంగా నడుస్తున్న వ్యవస్థ పట్ల కొంత మంది భగ్గుమంటున్నారు. చూసేందుకు అంతా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు కనపడుతున్నా లోపల మాత్రం జరిగే తంతు వేరేగా కనపడుతుంది.

గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ

-ప్రజలకు దగ్గరగా ఉండి మెరుగైన సేవలు అందించాలి

-ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పిఎస్, సచివాలయ సిబ ందితో మాట్లాడుతున్న కలెక్టర్

కేవి.పల్లె, నవంబరు 2 ప్రభాతవార్తః

ప్రజలకు దగ్గరగా ఉండి మెరుగైన సేవలు అందించడంతో పాటు సచివాయలానికి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం, త్వుపల్లె గ్రామ సచివాలయాలను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆకస్మికంగా తనిఖీచేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, మూవ్‌మెంటు రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్ ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ ఆరాతీసి ఎన్ని ఇల్లు మంజూరు ఎన్ని పూర్తైయ్యాయి. పూర్తికానివి వెంటనే పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. జిల్లళ్లమంద, నూతనకాలువ గ్రామాలలో ఇళ్ల నిర్మాణం పురోగతి బాగుందని మిగతా గ్రామాలలో ఇళ్ల నిర్మాణం పురోగతి కనపడాలని ఎంపీడీఓను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని తహశీల్దారుకు ఆదేశించారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం చుక్కల భూములు ఎన్ని ఉన్నాయి. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. వాటి వివరాలను వీఆర్వోను కలెక్టర్ ఆరాతీశారు. వారానికి ఒక విలేజ్‌కు సంబంధించి డాట్ డ్ ల్యాండ్స్ దరఖాస్తులు క్లియర్ చేసేందకు చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలో ఎంతమంది గర్భిణీలు ఉన్నారు. ఎంత మందికి రక్తహీనతతో బాధపడుతున్నారు వంటి వివరాలను ఏఎన్ఎమ్‌లను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతను దూరం చేయడానికి వారికి పౌష్టికాహారం తీసుకునేలా మరింత అవగామన కల్పించాలన్నారు. రెగులర్‌గా మెడికల్ ఆఫీసర్‌లతో అనమిక్‌పై పర్యవేక్షణ చేయాలని డీఎంహెచ్ఓను ఫోన్‌లో ఆదేశించారు. మహిళా పోలీసు రిజిస్టర్లు మెంటైన్ చేయక పోండంతో కలెక్టర్ అసంతుప్తి వ్యక్తం చేసి సంబంధిత సీడీపీఓ సూపర్ వైజర్‌కు ఫోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీని కలెక్టర్ ఫోన్‌లో ఆదేశించారు. తువ్వపల్లె గ్రామ సచివాలయంలో ఆర్ ఎల్ 19 ఉన్నాయి. ఆర్‌సీకి తీసుకురావాలని ఇంజినీర్ అసిస్టెంట్లకు సూచించారు. బీబీఎల్‌లో ఉన్న ఇల్లను బీఎల్‌కు తీసుకురావాలన్నారు. ఇల్ల నిర్మాణాలు సరిగ్గా జరగడం లేదని అసంతప్తి వ్యక్తం చేశారు,. వీఆర్ఓ మ్యుటేషన్ సరిగ్గా చేస్తున్నారా లేదా గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గత ఆరు నెలల నుంచి 4 దరఖాస్తులు మ్యుటషన్ల కోసం రావడం ఏమిటని సరిగ్గా చేస్తున్నారా లేదా అని కెలెక్టర్ వీఆర్వోను, డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. తువ్వపల్లె ఏఎన్ఎం రిజిస్టర్ మెంటైన్ చేయకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి సరిగ్గా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం సేవలు బాగా అందిస్తున్నారా లేదా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ,తహశీల్దారు మహమ్మద్ అజారుద్దీన్, ఎంఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ ఎంఈఓ రెడ్డిబాషా, సర్పంచి లక్ష్మీదేవి, ఏఎన్ఎమ్‌లు, ఆశకార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న వైఎస్ఆర్

- వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించిన మంత్రి రజని

వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రజని, పులివెందులలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి రజని

వేంపల్లె, నవంబరు 02, ప్రభాతవార్త :

తెలుగు ప్రజల గుండెల్లో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని అన్నారు. బుధవారం ఇడుపులపాయలో ఆమె పర్యటించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటగా డాక్టర్ వైఎస్ఆర్ సమాధికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ లాంటి గొప్ప నేత బతికి ఉంటే రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందేదన్నారు. తండ్రి వైఎస్ఆర్ బాటలోనే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. పులివెందులలో ః పేద ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలిచిన పులివెందులలో మెడికల్ కాలేజి నిర్మాణ పనులు ముఖ్యమంత్రి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టడం జరుగుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. బుధవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజి నిర్మాణ పనులను వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు, సంబంధిత అధికారులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 16 మెడికల్ కాలేజిల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు పూనుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సముచిత స్థానాన్ని సంపాదించుకున్న ముఖ్యమంత్రి ఈ ప్రాంత వాసి కావడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ సందర్భంగా పలువురు పులివెందుల ప్రజాప్రతినిధులు గౌరవ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అప్రమత్తమయిన పోలీస్ యంత్రాంగం

-జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి.నవంబర్ 02 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా పరిధిలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఎలాంటి నష్టం జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. బుదవారం జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నిండి గండిపడే అవకాశాలు ఉన్న వాటిని ముందస్తుగా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం నిండిన కుంటలు చెరువులను ముందు జాగ్రత్తగా ఎలాంటి విపత్తులు జరగకుండా పోలీస్ అధికారులు పరిశీలించారని ఎస్పీ ఆదేశించారు. అవసరమయితే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న నేపద్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్‌లుకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలకు విద్యుత్ స్థంబాలు చెట్లు, రోడ్లుపై నేలకొరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్‌లు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. అవసరమయిన చోట తగు బందోబస్తు ఏర్పాటుతో పాటు అత్యవసర సహాయక బృందాలను అందుబాటులో ఉంచారు. వాగులు, వంకలు వరద నీటిలో ప్రజలు చిక్కుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్‌లను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడయినా వాగులు వంకలు పొంగిపొర్లితే ఆయా రహదారులపై ప్రజలు వాహనాల రాకపోకలు కొనసాగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలలో వాగులు ప్రజలు దాటకుండా నిషేదించాలని చెప్పారు. రెవెన్యూ మున్సిపల్ పంచాయతీ అధికారులు సమన్వయంతో సహాక చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ సిబ్బంది తక్షణ సహాయక చర్యలు చేపట్టడానికి సిద్దంగా ఉదన్నారు. ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని, తమ పరిసర ప్రాంతాలలో ఇళ్లు గోడలు కూలి పోవడం, చెట్లు నేలకొరగడం విద్యుత్ స్థంబాలు మరియు తీగలు తెగిపోయిన చోట వెంటనే సంబందిత అధికారులుకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

భారీ బియ్యం స్కాం చేధించడానికి కసరత్తు

- ఆర్డీవో మురళీ ఆధ్వర్యంలో విచారణ కమిటీ సమీక్ష - డీలర్లతో విచారణ

- రెండేళ్లుగా ఆర్ఓలు లేరు.. విచారణకు సహకరిస్తే న్యాయం చేస్తాం

తంబళ్లపల్లె, నవంబరు 2, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రం పౌరసరఫరాల కేంద్రంలో జరిగిన భారీ బియ్యం కుంభకోణం రాష్ట్రంలోని సంచలనంగా నిలిచినట్లు అధికారులు అబి ప్రాయపడుతున్నారు. ఈ భారీ కుంభకోణంపై గత 4 రోజుల క్రితమే అధికా రులు గుర్తించి సంబంధిత డీటీ హరిప్రసాద్‌ను సస్పెండ్ చేసి డ్యూటీ ఆపరేటర్ సదాశివను విధుల నుంచి తొలగించి ఈ కుంభకోణంపై వారం రోజుల్లో నిగ్గు తేల్చాలని జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై బుధవారం మదనపల్లి ఆర్డీవో మురళీ, డీఎస్ఓ రఘురాం, డీఎం శ్రీనివాస్‌లు తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు కళావతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి సమక్షంలో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె, (మిగతా IIవ పేజీలో)

కేంద్ర మంత్రి పర్యటన విజయవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

కడప, నవంబర్ 2 ప్రభాతవార్త :

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి ఏ. నారాయణ స్వామి.. జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారత రాష్ట్రీయ సామాజిక న్యాయం, సాధికారత శాఖ కేంద్రమంత్రి జి. నారాయణ స్వామి ఈ నెల 8వ తేదీన జిల్లాకు రానున్న నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత ఏర్పాట్లపై జేసీ సీ.ఎం. సాయికాంత్ వర్మ, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర గౌడ్, ఓఎస్డీ ఎస్. రఘునాథ్‌లతో కలిసి సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, కార్యాచరణ అంశాలకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా జిల్లాలో కేంద్ర మంత్రి పర్యటన కార్యక్రమాలకు సంబందించిన ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ప్రోటోకాల్ అరేంజ్ మెంట్స్, ఇతర ఏర్పాట్ల పర్యవేక్షణకు గాను సంబందిత అధికారులకు పలు విధులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో సిపివో వెంకటరావు, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, హౌసింగ్ పీడి కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛను నగదును దోపిడీకి యత్నించిన ఐదుగురు అరెస్ట్

- దోపిడీని అడ్డుకున్న పెండ్లిమర్రి పోలీసులు

- 5 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్రవాహనాలు, 30 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

- విలేకరుల సమావేశంలో ఏఎస్పీ తుషార్ డూడి

కడప క్రైం, నవంబరు 2, ప్రభాతవార్త:

ప్రజలకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ పింఛను నగదును దోపిడీ చేయాలని ప్రయత్నించిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ తుషార్ డూడి వెల్లడించారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్రవాహనాలు, 30 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక పోలీసు పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఈ విషయాన్ని వెల్లడించారు. పెండ్లిమర్రి మండలం గొందిపల్లె సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మాబున్నీ ప్రతి నెలా పింఛను సొమ్మును నెలాఖరులో బ్యాంకు నుంచి డ్రా చేసుకొని 1వ తేదీన అర్హులైన పింఛనుదారులకు పంపిణీ చేస్తుండేది. ఈ నేపథ్యంలో అక్టోబరు నెలకు చెందిన 1వ తేదీ ఆమె పింఛను నగదు డ్రా చేసుకొని పింఛనుదారులకు పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో 1వ తేదీ కడప నగరంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చింది. అయితే ఈమె కదలికలను గమనించిన గతంలో (మిగతా IIవ పేజీలో)

పిడికెడు ఆహారంలో పితలాటకం..

- తిండిలోనూ తిరకాసు.. - కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..

- తనకు అడ్డులేదనే అహంకారం..

- కార్మికులకు నాసిరకం ఆహారం అందిస్తున్న నిర్వాహకులు

- కొన్నేళ్లుగా ఇదే తతంగం.. - నోరుమెదపని యంత్రాంగం

- నాణ్యమైన భోజనం అందించాలంటున్న కార్మికులు

ఓబులవారిపల్లె, నవంబరు 2, ప్రభాతవార్త:

అన్నం పరబ్రహ్మ స్వరూం అన్న నానుడికి తిలోదకాలిస్తూ అందిన కాడికి దండుకుంటున్న ఓ కాంట్రాక్టర్ నిర్వాకమిది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మంగంపేట ఏపీఎండీసీలో తిండిలోనూ తిరకాసు రకంగా నాసిరకం ఆహారం అందించిన వైనంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. నిర్ణయించిన రేటు తీసుకుంటూ రుచికరమైన ఆహారం అందించకపోవడం పట్ల అటు సిబ్బంది, ఇటు కార్మికులు, ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. మంగంపేట అంటే తెలియనివారుండరు. ఇక్కడ పనిచేసే అధికారులకు, సిబ్బందికి, కార్మికులకు సంస్థ ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపట్టింది. సంక్షేమంలో భాగంగా సంస్థలో పనిచేసే కార్మిక ఉద్యోగులందరికీ మంచి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలనే దృఢ సంకల్పంతో ఈ పథకాన్ని అమలు పరిచింది. ఇందుకోసం నిరంతరం శ్రమించే సిబ్బందికి, కార్మికులకు తక్కువ రేటుతో రుచికరమైన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ బాధ్యతను సంస్థ పరిధిలోని బాధితుడికి ఇస్తే ఉపాధి కల్పించినట్లు ఉంటుందని సంస్థ భావించింది. ఇందుకోసం టెండర్ వేస్తే ఒక ప్రైవేటు నిర్వాహకుడు చక్రం తిప్పి టెండరు అధికారులు, రాజకీయ అండదండలతో దక్కించుకున్నాడు. ఇక్కడి నుంచి ఆదాయ మార్గాన్ని పెంచుకున్నాడు. ఇదే కాంట్రాక్ట్ మళ్లీ మళ్లీ వస్తే భోజనం నాణ్యత లోపిస్తుందని మరికొంత మంది కార్మికులు సంస్థలో పనిచేసే వారు పోటీకి టెండరు దక్కించుకోవాలని సర్వ ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ భోజన వసతిపై క్యాంటీన్‌లో భోజనం చేసేటప్పుడు కొంత మంది కార్మికులు కాంట్రాక్టరుతో భోజనం సరిగా లేదని గొడవలకు దిగిన దాఖలాలున్నాయని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు తెలిపినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుందని ఆరోపిస్తున్నారు. భోజనం సరిగా లేదని కార్మికులు, ఉద్యోగులు ఇంటి వద్ద నుంచే తెచ్చుకుంటున్నట్లు తెలుపుతున్నారు. ఏది ఏమైనా కార్మికుల సంక్షేమ పథకం కింద కార్మికుడికి, ఉద్యోగునికి 30% సంస్థ వాటా 70% నిధులతో వంద శాతం కాంట్రాక్టరుకు నిధులు మంజూరు చేసి నాణ్యమై భోజనం కల్పించాలని సూచిస్తున్నా ఆయన నిర్వాకంతో కాంట్రాక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్నారని కార్మిక నాయకులు, కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం ఎక్కడ చూసినా మంగంపేటలో భోజనాలపై నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కార్మికుల ఆహార సంక్షేమానికి కేటాయిస్తున్నట్లు పలువురు కార్మిక సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ కొంత నాణ్యత లోపం ఉందని వి

వివాహేతర సంబంధం తెచ్చిన తంట

– ప్రియుడి చేతిలో ప్రియురాలు హత్య

బి.కొత్తకోట, నవంబర్ 2 ప్రభాతవార్త :

హేమావతి (ఫైల్)

వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాలు బలిగొంది. తనను మోసం చేసి మరొక వ్యక్తితో కూడా అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఆవేశానికి గురైన ప్రియుడు ప్రియురాలిని హత్యచేసి అటవీప్రాంతంలో పూడ్చి పెట్టాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. తానే హత్య చేసినట్లు ఒప్పుకుని నేరస్తుడు పోలీసులకు లొంగిపోవడంతో హంతకుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు, బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్‌లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం చిక్‌బలాపూర్ జిల్లా తలకాయలకొండ గ్రామానికి చెందిన హేమావతి(42) బి.కొత్తకోటలోని నందిశెట్టి వీధిలోని తన కుమార్తె భవాని ఇంటికి తరచూ వస్తుండేది. ఆమెకు నందిశెట్టి వీధికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తితో పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరిద్దరూ 5 ఏళ్ల క్రితం బెంగళూరులోని బూదగిరి క్రాస్‌లో అద్దెకు ఇల్లు తీసుకుని జీవించేవారు. ఈ ఏడాది జనవరిలో వీరి మధ్య మనస్పర్థలు రావడంతో శ్రీకాంత్‌ను తన ఇంటికి రావద్దని హేమావతి గట్టిగా హెచ్చరించింది. ఈనెల 28వ తేదీన హేమావతి బి.కొత్తకోటలోని తన కుమార్తె ఇంటికి వచ్చింది. హేమావతి తనను కాదని వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో శ్రీకాంత్ టమోటా పుర్రి కోసే కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. గుట్టు చప్పుడు కాకుండా మోటారుబైక్‌లో ఇంటికి వచ్చి తన అశోక్‌లైలాండ్ వాహనాన్ని బోరుబావి వద్దకు తీసుకెళ్లి తనతో తెచ్చుకున్న చాప, బెడ్‌షీట్‌లో మృతదేహాన్ని చుట్టి వాహనంలో ములకలచెరువు మండలం బత్తలాపురం సమీపంలోని అటవీప్రాంతంలో గోతి తీసి పూడ్చి పెట్టాడు. తల్లి రెండు రోజులుగా కనిపించడం లేదని ఆమె కుమార్తె భవాని మంగళవారం బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇంతలో శ్రీకాంత్ అనే వ్యక్తి బి.కొత్తకోట వీఆర్వో ఖాదర్‌బాషా వద్దకు వచ్చి హేమావతి అనే మహిళను తానే హత్య చేశానని తెలిపి వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయాడు. అక్రమ సంబంధం కారణంగానే హత్య జరిగిందా లేక ఇంకా మరేవైనా కారణాలు ఉన్నాయా, అనేకోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని మదనపల్లె రూరల్ సీఐ శివాంజ నేయులు, బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

విస్తృతంగా పంట నమోదు

జమ్మలమడుగు, నవంబరు 2, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన 59 రకాల పంటలను క్షేత్రస్థాయి సిబ్బంది 5729 మంది రైతులకు గాను 17656 ఎకరాల్లో పంట నమోదు చేసి నట్లు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఈకేవైసీ చేయించడం జరిగిందని ఇందులో భాగంగా 5583 మంది రైతులకు గాను 17265 ఎకరాల్లో సాగు చేసిన రైతులకు గాను ఈకేవైసీ క్షేత్ర స్థాయి సిబ్బంది చేసినట్లు తెలిపారు. ప్రతి పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకుంటేనే సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని తెలిపారు. ప్రతి ఆర్‌బీకేలో పంట నమోదు జాబితాను ఉంచారని రైతులు పరిశీలించుకోవాలన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా పత్తి, బత్తాయి, పొద్దుతిరుగుడు, కంది, ఉల్లి, ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మిగిలిన పంటలు స్వల్పంగా కూరగాయ పంటలు వాణిజ్య పంటలు ఆహార ధాన్యాలు, నూనెగింజ పంటలు వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేసినట్లు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ తులసి రాముడు బదిలీ

జమ్మలమడుగు, నవంబరు 2, ప్రభాతవార్త:

ఏపీఎస్ ఆర్టీసీ జమ్మలమడుగు డిపో నందు హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.తులసీ రాముడు ఆళ్లగడ్డ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో డీసీ ఆయిల్స్, నాగిరెడ్డి రీజనల్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు, డిపో ట్రెజరర్ రాజు, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎం. వలీ, అధిక సంఖ్యలో ఉద్యోగస్థులు, డిపో కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంక్ ద్వారా మంచినీటి సరఫరా

కమలాపురం, నవంబరు 2, ప్రభాతవార్త:

కమలాపురం నగర పంచాయతీలో అభివృద్ధి పనులు చేస్తున్న సమయంలో ప్రధాన పైపులైను పగిలిపోవడంతో 9, 10వ వవార్డుల్లో నీళ్లు రాని విషయం తెలుసుకున్న మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్ ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్ ఏర్పాటు చేసి నీరు సరఫరా చేశారు. కమలాపురం పట్టణంలో 6వ వార్డు ఆర్సా నగర్ ప్రజలకు మంచి నీరు రావడం లేదని తెలుసుకున్న మీగడ రామసుబ్బారెడ్డి, ఎర్రబల్లి సుబ్బారెడ్డిలు ట్యాంకర్ ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నారు. పైపులైన్ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ట్యాంకర్ ద్వారా నీరు ప్రజలకు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తామని తెలిపారు.

వృద్ధున్ని అనాథ ఆశ్రమానికి తరలింపు

కమలాపురం, నవంబరు 2, ప్రభాతవార్త:

పట్టణంలోని ఎర్రవల్లి గణేష్ (82) అనే వృద్ధుడిని మద్రాస్‌కు చెందిన వ్యక్తి గత 45 సంవత్సరాల నుంచి కమలాపురంలో ఉంటూ ఏదో ఒక కూలి పనికి వెళ్లి జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. వృద్ధాప్యంలో ఇతనిని చూసుకునే వారు ఎవరూ లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో అతనిని గమనించి పట్టణానికి చెందిన శేషు మరియు సుబ్బారెడ్డి అభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎన్.విజయ బాబు ఫోన్ ద్వారా తెలియజేయడంతో అక్కడికి వెళ్లి ఆ వృద్ధుడిని ట్రస్ట్ సభ్యుడు హనుమంతు మిగతా సభ్యులు కలిసి ఆ వృద్ధుడికి స్నానం చేయించి అనారోగ్యంతో ఉన్న అతన్ని ఆసుపత్రిలో చికిత్స చేయించి తిప్పలూరులో ఉన్న ఎద్దుల పెద్దశేషమ్మ అనాథాశ్రమం నిర్వాహకుడు నాగేంద్రతో మాట్లాడి చేర్పించడం జరిగింది. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండగ

కమలాపురం, నవంబరు 2, ప్రభాతవార్త:

సీఎస్ఐ టౌన్ చర్చిలో సమాధుల వద్ద చర్చి పాస్టర్ భరత్ హెరాల్డ్ సమక్షంలో సమాధుల తోటను సుందరంగా పూలతో తీర్చి దిద్ది, ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా తాము భూమిపై నివసించేది తాత్కాలికమే కానీ, మన శాశ్వత స్థలం సమాదేనన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘం సభ్యులు, ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

దువ్వూరు, నవంబరు 2, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో గత నెల 18న యువతి మెడలో బంగారు గొలుసు, ఉంగరాలు 2 చోరీ చేసిన సంఘటనలో నిందితుడైన దువ్వూరు మహబూబ్‌బాషాను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కేసీ రాజు తెలిపారు. నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని ప్రొద్దుటూరులోని ఒక ఫైనాన్స్ కంపెనీ నందు కుదువ పెట్టాడని దాన్ని విడుదల చేసేందుకు చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిందితున్ని మైదుకూరు కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రిమ్స్ సీఐగా రామచంద్ర బాధ్యతలు

కడప క్రైం, నవంబరు 2, ప్రభాతవార్త:

నగర శివార్లలోని రిమ్స్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా కె.రామచంద్ర బుధ వారం బాధ్యతలను చేపట్టారు. అనంతపురం జిల్లా తలుపులకు చెందిన ఈయన 1998 లో ఎస్సైగా ఉద్యోగంలో చేరి హైదరాబాదు సిటీలో పనిచేశారు. జిల్లాకు 2010 లో వచ్చిన ఆయన మొదట ఆర్‌కే వ్యాలీ, రైల్వేకోడూరు, పెండ్లిమర్రితో పాటు పలు స్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. 2016లో సీఐగా పదోన్నతి పొంది న ఆయన ఏసీబీలో పని చేశారు. బద్వేలు సీఐగా అక్కడి నుంచి మరలా ఎస్‌బీ సీఐగా పని చేస్తుండగా రిమ్స్ సీఐగా బదిలీ వచ్చింది. బాధ్యతలను చేపట్టిన ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఉన్నతాధికారుల ఆదేశాల, సహచరుల, ప్రజల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న సదాశివయ్య జమ్మలమడుగు అర్బన్ సీఐగా బదిలీ అయ్యారు.

తప్పిపోయిన మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 2, ప్రభాతవార్త:

మండలంలోని కస్తూరి రాజుగారి పల్లెకు చెందిన అరుణ అనే మహిళ జులై 18వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, పోలీసు స్టేషన్‌లో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై వినోద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఎస్సై తమ సిబ్బందితో ట్రేస్ చేసి మహిళను తీసుకొచ్చి బుధవారం తహసీల్దారు నాగప్రసన్న లక్ష్మి ఎదుట తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళ ఆచూకీ కోసం కృషి చేసిన హెడ్‌కానిస్టేబుల్ గోపినాయక్, కానిస్టేబుల్ విద్యాసాగర్, ఫైజావలీలకు రివార్డుతో అభినందించారు.

సమస్యల వలయంలో 38వ డివిజన్

– పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

కడప ఏడురోడ్లు, నవంబర్ 2, ప్రభాతవార్త:

కడప కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ సమస్యల వలయంగా మారింది. అల్మాస్‌పేట పరిధిలోని యానాది కాలనీ, బిస్మిల్లానగర్‌లో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. అయితే లోతట్టు ప్రాంతంలో సమస్యలు అనేకం ఉన్నాయి. గత మూడు పర్యాయాలుగా ఒకే వ్యక్తి ప్రజా ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. బిస్మిల్లా నగర్ నగరపాలక సంస్థ ఉర్దూ స్కూలు సమీపంలోని ఎప్పుడో తాతల కాలం నాటి మురుగు కాలువలు వర్షాలు పడినా పడక పోయినా పొంగి రోడ్డుపై పొర్లుతుంటాయి. ఒకటే దుర్వాసన, ఇక్కడే స్కూలు ఉండడంతో పిల్లలు, స్థానికులు తరుచు రోగాల భారిన పడుతున్నారని ప్రజలు భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ తూతూ మంత్రంగా మెయిన్ సెంటర్‌లో పర్యటిస్తే ఏమి లాభం లోతట్టుకు వస్తే సమస్యలు తెలుస్తాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల కుహరం బిస్మిల్లా నగర్‌లో ప్రవేశంలో రంగు రంగుల భవనాలు తప్ప సమస్యలు కనపడవు. లోతట్టు 8/581-1 ఇంటి నెంబరు గల ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు నిర్మించని మురుగు కాలువలు పొంగి రోడ్డుపై పొర్లుతు దుర్వాసన వెదజల్లుతూ స్వాగతిస్తుంటాయి. పేరు గొప్ప.. వీధి (ఊరు) దిబ్బ అనే చందంగా బిస్మిల్లా నగర్‌కు చక్కగా సరిపోతుందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా నగర మేయర్, కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యలను చూసి పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భారీ బియ్యం స్కాం చేధించడానికి కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

పెద్దమండెం మండలాలకు చెందిన స్టోర్ డీలర్లతో పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ప్రతి నెలా మీరు తంబళ్లపల్లె పౌరసరఫరాల గోదాం నుంచి స్టాక్ తీసుకెళ్తున్నారా, ఆర్వోలు ఇస్తున్నారా, బియ్యం అడ్వాన్స్‌గా ఏమన్నా తరలించారాఅని ఇంకా పలు రకాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోదాము నుంచి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు తరలింపు మొత్తం డ్యూటీ ఆపరేటరే చూసుకునేవారని ఆర్వో అడిగితే కుంటి సాకులు చెప్పే వారిని డీలర్లు కమిటీ సభ్యులకు తెలిపారు. గోదాం నిత్యావసరాల సరఫరా తతంగం మొత్తం నిర్వహించేవాడని ఆర్వో లేకుండా నోటి మాటతోనే పంపిణీ జరిగేదని కమిటీ సభ్యుల విచారణలో తేటతెల్లమైంది. సుమారు 2 సంవత్సరాలుగా ఆర్వోలు లేకుండా నిత్యావసర సరుకుల పంపిణీ జరిగినట్లు డీలర్లు చెప్పుకొచ్చారు. గత 2 మాసాలుగా కొంత మంది డీలర్లకు నిత్యావసరాలు చెల్లించినట్లుగా జనరేట్ చేసి సరుకులు సక్రమంగా అందకపోవడం అడిగితే రేపు, మాపు అంటూ కాలం గడిపినట్లు డీలర్లు వాపోయారు. కొందరు డీలర్లు డీటీ హరిప్రసాద్, డ్యూటీ ఆపరేటర్ సదాశివలు కంప్యూటర్, ప్రింటర్ పని చేయలేదని సాకు చెప్పి వారిపై నమ్మకంతో మోసపోయి సరుకుల కోసం వేచి చూసి నిండా మునిగినట్లు బహిర్గతమైంది. రెండేళ్లుగా ఆర్వోలు లేకుండా బియ్యం సరఫరా జరుగుతున్న విషయం కొత్తగా వచ్చిన తహసీల్దారు కళావతి దృష్టికి వచ్చి నిలదీయగా ఏవో కట్టు కథలు చెబుతూ మభ్యపెడుతూ వచ్చారు. ఆమె బాధ్యతలు తీసుకుని 2 మాసాలుగా కచ్చితంగా ఆర్వోలు ఉంటేనే నిత్యావసర సరుకులు సరఫరా జరగాలని ఆదేశించడంతో సజావుగా జరుగుతోంది. ఈ విషయమై ఆర్డీవో మురళీ మాట్లాడుతూ 2 మండలాల్లోని స్టోర్ డీలర్లు ఆర్వోలు లేకుండా బియ్యం ఎలా తరలించారని ప్రశ్నించారు. డీలర్లు ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల నుంచి తంబళ్లపల్లె గోదాము నుంచి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు ఎంత స్టాకు తీసుకెళ్లారు, ఎంత పంపిణీ చేశారు, మిగిలిన స్టాకు ఎంత ఉందో లిఖితపూర్వకంగా రిపోర్టు రాసి ఇవ్వాలని సజావుగా ఉంటే పర్వాలేదని అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబరు మాసంలో కార్డుదారులకు ఇబ్బంది లేకుండా పీడీఎస్ ప్రకారం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.

ఇంత పెద్ద స్కాం నేనెప్పుడూ చూడలేదు : ఆర్డీవో మురళీ

పౌరసరఫరాల శాఖలో ఇంత పెద్ద స్కాం నేనెప్పుడూ చూడలేదని ఆర్డీవో మురళీతో పాటు విచారణ కమిటీ సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుమారు 2వేల బస్తాల బియ్యంతో పాటు 20 టన్నుల కందిపప్పు, 223 లీటర్ల పామాయిల్, 2810 కేజీల చక్కెర సుమారు 4.5 కోట్ల విలువ కలిగి ఉంటుందన్నారు. తంబళ్లపల్లెకు రావాల్సిన సరుకులు స్టేజ్-1 (రేణిగుంట) నుంచి స్టేజ్-2 (మదనపల్లె) నుంచి తంబళ్లపల్లెక చేరాయా లేదా విచారణ ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. స్టేజ్-3 తంబళ్లపల్లెకు పీడీఎస్‌తో పాటు కరోనా సమయంలో ఉచిత బియ్యం తరలించినా ఇక్కడ స్థలాభావంతో నేరుగా స్టోర్లకు తరలించిన కచ్చితంగా ఆర్వోలు తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా ప్రజా పంపిణీలో ప్రతి నెలా నెల వారి లెక్కలు పూర్తిగా అప్పగిస్తేనే రెండో మాసం స్టాక్ రిలీజ్ చేస్తారు. పై నుంచి వచ్చిన బియ్యాన్ని అడ్వాన్సు రూపంలో డీలర్లకు తరలించారా లేదా అనే విషయంపై సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. విచారణలో ముగ్గురు కమిటీ సభ్యులతో పాటు తహసీల్దారు కళావతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ రవినాయక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛను నగదును దోపిడీకి యత్నించిన ఐదుగురు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సచివాలయంలో రామచంద్రాపురం గ్రా వాలంటీరుగా పనిచేసిన అంకెన శివాంజనేయులుకు, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మాబున్నీకి మధ్య ప్రభుత్వ సెల్‌ఫోన్ వాడే విషయమై గొడవ జరిగి అప్పటల్లో అతను ఉద్యోగం మానేశాడు. అయితే విషయాన్ని మనసులో ఉంచుకొని ఆమెపై పగ పెంచుకొని ఎలాగైనా పగతీర్చుకోవాలనే ఉద్దేశంతో శివాంజనేయులు తనకు పరిచయం ఉన్న పొలతల ఫారెస్ట్ బీట్ ఏబీవో ఆవుల చంద్రశేఖర్‌రెడ్డితో పరిచయం పెంచుకొని వారిద్దరూ మద్యం సేవిస్తూ స్నేహితులుగా ఉండేవారు. ఈ విషయమై మాట్లాడుకొని పింఛను డ్రా చేసఉకొనే వచ్చే సమయంలో నగదును దోపిడీ చేయాలన్న ఉద్దేశంతో అన్నమయ్య జిల్లాకు చెందిన బండి సాంబశివారెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, సి.ప్రసాద్‌రెడ్డి అనే మరో ముగ్గురితో కలిసి ఐదుగురు ఐదు ద్విచక్రవాహనాలలో ఆమె కదలికలను గుర్తిస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో కడప రూరల్ సీఐ శ్రీరామ్ శ్రీనివాస్, పెండ్లిమర్రి ఇన్‌ఛార్జి ఎస్సై విష్ణువర్ధన్, ఏఎస్సై శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి, తమ సిబ్బందితో కడప-పులివవెందుల చీమలపెంట వద్ద వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అయితే దోపిడీకి యత్నించిన వారిని చాకచక్యంగా ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ అభినందించి రివార్డులకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

రాయలసీమలో పాలన రాజధాని ఏర్పాటు చేయాలి

రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ నేత కుంచం వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్, నవంబరు 2, ప్రభాతవార్త:

రాయలసీమ ప్రాంతంలో పాలన రాజధాని ఏర్పాటు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షులు డా.కుంచం వెంకట సుబ్బారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రాజధానుల పేరుతో ఏపీ సర్కార్ రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. బుధవారం కడప నగరంలోని హరిత హోటళ్లో పాత్రికేయుల సమావేశంలో కుంచం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజా ప్రతినిధులు శాసనభలో, పార్లమెంటులో రాయలసీమ అభివృద్ధి కోసం ఏనాడు ఏం చేయలేదని ధ్వజమెత్తారు. గతంలో రాయలసీమలోని కర్నూలులో ఉన్న రాజధాని కోల్పోయామని గుర్తు చేశారు. పాలకులు దశాబ్దాలుగా 2 కోట్ల జనాభా ఉన్న రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన రాజధాని కోసం సీమ ప్రాంత ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేసి పోరాడాలన్నారు. ప్రపంచంలోని 42 దేశాల కన్నా రాయలసీమ పెద్ద ప్రాంతమన్నారు. దేశంలోని 14 రాష్ట్రాల కంటే కూడా సీమ పెద్దదని పేర్కొన్నారు. సహజ వనరులు, ఖనిజ సంపదకు, ప్రకృతి వనరులకు నిలయమన్నారు. ఇటువంటి రతనాల సీమలో న్యాయ రాజధాని కాకుండా పాలనా రాజదాని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమంపై కేంద్రం చొరవ చూపాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి రైతుకు సహాయ సహకారాలను అందిస్తాం

గోపవరం, నవంబర్ 2 ప్రభాతవార్త;

ప్రతి రైతుకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని బద్వేలు మార్కెట్ యార్డు చైర్మెన్ లక్ష్మీదేవి, వైస్ చెర్మెన్ నాగం సుబ్బారెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. మండలంలోని బేతాయిపల్లెలో బుదవారం సజ్జ దాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారం బించారు.అనంతరం వైస్ చెర్మెన్ నాగం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకొంటానన్నారు. రైతులకు గిట్టు బాటు ధర కల్పిస్తామన్నారు. ప్రస్తుతం సజ్జ క్విటాల్ ధర రూ,2350గా ఉందన్నారు.అదే విదంగా రైతులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందిస్తామన్నారు.కార్య క్రమంలో పుత్తా శ్రీరాములు,యాద్దారెడ్డి,మార్కెట్ యార్డు డైరెక్టర్ లు పాల్గొన్నారు.

సమస్యలను స్థానికంగా పరిస్కరించుకోవాలి

మండల ప్రత్యేకాధికారి నాగరాజు

గోపవరం,నవంబర్ 2 ప్రభాతవార్త;

మండల ప్రజలకు ఏర్పడే సమస్యలను స్థానికంగానే పరిస్కరించుకోవాలని మండల ప్రత్యేకాదికారి ఎం,నాగరాజు అన్నారు.ఆయన విలేఖరుతో మాట్లాడుతూ ప్రతి సోమవారం స్థానిక తాహశీల్దారు కార్యాలయంలో జరిగే స్పందనా కార్యక్రమంలో అన్ని శాఖల అదికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేద్రానికి వెళ్లినా ఏర్పడిన సమస్యను స్థానిక అదికారులు మాత్రమే పరిస్కరించాలనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు.అదే విదంగా గ్రామాలలో ఏవైనా ఇబ్బందులుంటే వెంటనే తమకు తెలపాలన్నారు.ఆయా శాఖాదికారుల సేవలను సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్య ఉప కేంద్రం మరమ్మతులకు నిధులు విడుదల

మదనపల్లి క్రైం, నవంబర్ 2 ప్రభాతవార్త :

పిటిఎం మండలం కందుకూరు ఆరోగ్య ఉప కేంద్ర మరమ్మతులకు నిధులు త్వరలో విడుదల కానున్నట్లు వైద్యాధికారి అభిలాష తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రం కథ కొంతకాలంగా మరమ్మతుల గురి కావడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నా అన్నారు. వర్షం పడితే ఆసుపత్రి మొత్తం వర్షపు చినుకులతో తడిసి ముద్దవ్వడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మరమ్మతులను ప్రారంభిస్తామన్నారు. అనంతరం రోగులకు పూర్తిస్థాయిల వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

జాతి సమగ్రతకు అహర్నిశలు కృషి చేస్తా

పెనగలూరు, నవంబరు 2 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడిగా నియామకపత్రం ఇస్తున్న దృశ్యం

జాతి సమగ్రతకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నమయ్య జిల్లా ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల శివశంకర్ అన్నారు. మండల పరిధిలోని ఈటమాపురంకు చెందిన శివశంకర్‌కు ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.వెంకట నారాయణముదిరాజ్ చేతులమీదుగా జిల్లా అధ్యక్ష నియామకపత్రాన్ని బుధవారం నెల్లూరులో జరిగిన ముదిరాజ్‌ల సమావేశంలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభలో అన్నమయ్య జిల్లా నుండి ముదిరాజ్‌ల సంఘానికి జిల్లా అధ్యక్షులుగా ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నానని, జాతికి విశిష్ట సేవలు అందిస్తానని, తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవి ఇచ్చిన ముదిరాజ్ సంఘం ఛైర్మన్, రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.

ఆర్టీసి అధికారులకు కృతజ్ఞతలు

మైదుకూరు, నవంబర్ 2 ప్రభాతవార్త :

తాహీర్, హజీరాలు మెడిసిన్ కోచింగ్ తీసుకుంటూ హైదరాబాదులో ఉన్నామని హైదరాబాదు నుంచి కడపకు వచ్చు సమయంలో మార్గమధ్యలో బస్సు మరమ్మతులకు గురైందని తమను మరో బస్సులో పంపారని ఆ సమయంలో తమ బ్యాగును విలువైన మెడిసన్ బాక్సు విలువైన వస్తువులను మైదుకూరు బస్టాండులో మరచిపోయామని కడపలో దిగి చూసుకుంటే లేవని ఈ విషయాన్ని ఆర్టీసి అధికారులకు తెలిపామని. మా టికెట్ ఆధారంగా ఆర్టీసి అధికారులు తమ సామాగ్రి తిరిగి అప్పగించారని వారి తమ కృతజ్ఞతలు తెలిపారు.

పాత్రికేయులకు ప్రభుత్వం తగు న్యాయం చేయాలి

చిత్వేలి, నవంబరు 2 ప్రభాతవార్త

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం తగు న్యాయం చేయాలని బుధవారం సిపిఐ చిత్వేలి మండల ప్రధాన, సహాయ కార్యదర్శులు ప్రసాద్, సామా గంగయ్య పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణ పొందిన సీనియర్ జర్నలిస్టులకు 10 వేల రూపాయల పింఛను, కరోనాతో మరణించిన వారికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించిన విధంగానే ఎ

స్పందన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

మదనపల్లె, నవంబర్ 2 ప్రభాతవార్త :

స్పందనాలో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రాజంపేట ఎంపి, లోకసభ పక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నవాజ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనా కార్యక్రమానికి ఎంపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పందనాలో ప్రజలు విన్నవించిన అర్జీలను ఆయన స్వీకరించారు. రోడ్లు, మురుగునీటి కాలువలు, పెన్షన్లు, పక్కాగృహాలు, భూసమస్యలు, సంక్షేమ పథకాలపై ప్రజలు ఎక్కువగా స్పందనాలో ఎంపికి విన్నవించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ స్పందనాలో ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను పరిశీలించి గడువులోపు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మదనపల్లె-తిరుపతి నాలుగులైన్లు రోడ్లు, మదనపల్లె-మొలకలచెరువు జాతీయ రహదారి నాలుగులైన్ల రోడ్లు విస్తరణ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి పనులకు అత్యధికంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వెలుగు చంద్రా రెడ్డెమ్మ, జడ్పిటిసి ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మెన్‌లు జింకా చలపతి, నూర్ అజాం, తహశీల్దార్ సికె.శ్రీనివాసులు, ఎండిఓ తాజ్‌మస్రూన్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇంటిస్థలాలు కేటాయించాలని వినతి

మదనపల్లె, నవంబర్ 2 ప్రభాతవార్త :

మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులకు ఇంటిస్థలాలు కేటాయించాలని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి విన్నవించారు. బుధవారం పట్టణంలో ఎంపి నిర్వహించిన పర్యటనలో భాగంగా రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిని కలసి విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి దేవా మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారికి ఒకేచోట ఇంటిస్థలాలు కేటాయించాలని ఎంపిని కోరామన్నారు. ఇంటి స్థలాలతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని విన్నవించామన్నారు. ఎంపి స్పందించి త్వరలోనే ఇంటిస్థలాల మంజూరుకు చర్యలు తీసుకొంటామని చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇంద్రాణి, నాగరాజు, దేవా, గోపాల్, బాగ్యలక్ష్మి, లక్ష్మిదేవి, మల్లికార్జున పాల్గొన్నారు.

వెలుగు స్కూల్‌లో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

మదనపల్లె, నవంబర్ 2 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్టలో గల వెలుగు ప్రత్యేకపాఠశాల, వృద్ధాశ్రమం నందు బుధవారం లీగల్ అవైరెనెస్ క్యాంపినియన్ అండ్ అవుట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించారు. లీగల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల న్యాయ విజ్ఞాన వేధిక ఫారాలీగల్ వాలెంటీర్ సుబద్ర ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాన్ ఇండియా వారు దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమం అక్టోబర్ 31నుంచి నవంబర్ 13వరకు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా, మండల న్యాయసేవాసంస్థ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. వికలాంగులు, వృద్ధుల ట్రాస్‌జండర్స్‌అన్ని రకాల వారికి అవగాహన కలిగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం విజయవంతం : తహశీల్దార్

కలికిరి, నవంబర్ 2 ప్రభాతవార్త:

మండలంలోని కలికిరి పంచాయితీ కె.మాధిగపల్లెలో తహశీల్దార్ భాగ్యలత ఆధ్వర్యంలో జరిగిన పౌరహక్కుల దినోత్సవం విజయవంతమైంది. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తమ పిల్లలను ప్రతి ఒక్కరూ చదివించాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు చేయరాదని, బాల్యవివాహాలు వల్ల జరిగే అనర్థాలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఎక్కడైనా కులస్థులు కులవివక్ష చూపుతూ పౌరుల హక్కుల హరించే విధంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని అలా ప్రవర్తించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఏఎస్‌ఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉండి సోదర భావంతో మెలగాలని చిన్న విషయాలపు ఘర్షణ పడకూడదని ఆయన సూచించారు. గ్రామాలలో ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు తలెత్తితే పెద్దల సహ కారంతో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి మానటరింగ్ సభ్యులు గడ్డం ఏసురాజు, విఆర్‌ఓ విశ్వనాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లెక్రైం, నవంబర్ 2 ప్రభాతవార్త :

పట్టణంలోని కదిరిరోడ్డులోని బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రెండవ పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక సంగం పంక్షన్‌హాలు సమీపంలో సుమారు (55)ల వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. ఇతనికి మూర్చ లేక అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. స్థానిక జిల్లా ఆసుపత్రి మార్చురీలో మృతదేహం ఉంచామని వ్యక్తిని ఎవరైనా గుర్తించినా, వెంటనే పట్టణ రెండవ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఓ

పెద్దతిప్పసముద్రం, నవంబర్ 2 ప్రభాతవార్త:

పిటిఎం మండలానికి చెందిన తుమ్మరకుంట గ్రామ పంచాయితీలోని బొమ్మకపల్లె గ్రామంలో బుధవారం ఎంపి డిఓ గిరిధర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మద్యాహ్న భోజన పథకంలోని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరుపట్టికను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విషజ్వరాలైన డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా మెలగాలి : ఎస్‌ఐ

రామసముద్రం, నవంబర్ 2 ప్రభాతవార్త :

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా మెలగాలని ఎస్‌ఐ రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలతో ప్రజలు, విద్యార్థులు, ఎక్కడపడితే అక్కడ చెట్లకింద నిలబడకుండా, వంకలు, వాగుల వద్ద జాగ్రత్తగా మెలగాలని తెలిపారు. విద్యుత్ స్థంభాలను వర్షంలో ముట్టరాదని, రైతులు విద్యుత్ స్టాటర్లను తడి చేతులతో ముట్టరాదని తెలిపారు. సమావేశంలో విద్యుత్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వార్తకు స్పందన విద్యుత్తు వైర్లకు మరమ్మతులు

ఓబులవారిపల్లె, నవంబరు 2, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో సినిమా హాలు వద్ద మంచినీరు అందించే బోరుకు విద్యుత్తు తీగలు నేలపై ఉండి ప్రమాదానికి గురవుతున్నాయని వార్త కథనం ప్రచురితం కావడంతో బుధవారం విద్యుత్తుశాఖాధికారులు స్పందించి విద్యుత్తు వైర్లు తొలగించి ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించారు. ప్రజల సౌకర్యాలకు విద్యుత్తు అధికారులు, లైన్‌మెన్లు అందుబాటులో ఉంటారని వారన్నారు.

అక్రమాలకు చోటు ఇవ్వొద్దు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 2, ప్రభాతవార్త:

ఖజానా కార్యాలయంలో అక్రమాలకు ఎలాంటి చోటు ఇవ్వొద్దని అన్నమయ్య జిల్లా ఖజానా, లెక్కల శాఖాధికారి సయ్యద్ మహబూబ్ పేర్కొన్నారు. బుధ వారం లక్కిరెడ్డిపల్లె ఖజానా కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లె ఖజానా కార్యాలయంలో అన్ని శాఖల ఉద్యోగులు, ఇతరులు లావాదేవీలు పొందుతున్నారని ఖజానా కార్యాలయంలో సక్రమంగా పనిచేయాలన్నారు. రికార్డులు సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నాగసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలపోటీలలో గ్యారంపల్లె విద్యార్థుల ప్రతిభ

కేవి.పల్లె, నవంబరు 2 ప్రభాతవార్తః

మండల, నియోజకవర్గ స్తాయిలో 20 రోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఆటల పోటీలలో వివిధ కేటగిరీలలో దాదాపు 50 మంది విద్యార్తులు పాల్గొనగా వారిలో 41 మంది జిల్లా స్థాయికి ఎన్నికైయ్యారని అండర్- 17 విభాగంలో 26 మంది విద్యార్తులు ఎంపిక కాగా అండర్-14 విభాగంలో 13 మంది ఎంపికైయ్యారని హెచ్‌ఎం సురేష్ ఒక ప్రకటనలో అందుకు కషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పురుషోత్తంను హెచ్‌ఎం, వైస్‌హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

గర్భవతులకు అనీమియాపై అవగాహన

కేవి.పల్లె, నవంబరు 2 ప్రభాతవార్తః

మండలంలోని మారెళ్ల పంచాయతీ మారెళ్ల కస్పా అంగన్‌వాడీ కేంద్రంను సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ స్వర్ణ, జిల్లేళ్ల మంద మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి సందరి ్శంచడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలో అనీమియా లో ముగ్గురు గర్భవతులు ఉన్నారని వారికి మళ్లీ రక్తపరీక్షలు నిర్వహించి వారు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పి ంచాలని వైద్యులు సూచించారు.

10 లీటర్ల సారాయి స్వాధీనం ...ఒకరు అరెస్టు

పీలేరు, నవంబరు 2 ప్రభాతవార్తః

మండలంలోని జాండ్ల పంచాయతీ సూర్యానాయక్ తాండా క్రాసు వద్ద ఎస్‌ఈబీ ఎస్సై లక్ష్మీనరసయ్య, పీసీలు దాదులు చేయగా సూర్యానాయక్ తాండాకు చెందిన రామదాసునాయక్ వద్ద 10 లీటర్లు నాటుసారా కనుగొని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టుచేసి కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులు దేవాకు నివాళి

పీలేరు, నవంబరు 2 ప్రభాతవార్తః

వైఎస్సార్ సీపీ తిరుపతి 3వ డివిజన్ నాయకులు తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, భూమన అభినయరెడ్డి తరఫున నివా ళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో చీకటిపల్లె సర్పంచి, సీకామ్ కళాశాల అధినేత డాక్టర్ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన క్యాదర్శి రాజారెడ్డి, వైఎస్సార్ టీయూసీ అన్న మయ్య జిల్లా నాయకులు చిన్నయల్లప్ప, తిరుపతి జిల్లా నాయకులు షేక్ మహమ్మద్‌రఫీ ఉన్నారు.

గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీ

కురబలకోట, నవంబర్ 2 ప్రభాతవార్త :

గర్భవతుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నమయ్య జిల్లా డిప్యూటి డిఎంఅండ్‌హెచ్ లక్ష్మీ బుధవారం కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతుల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించి వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. సుఖప్రసవాలు జరిగేలా వైద్యసిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. గర్భవతులకు రక్తహీనతకు గురికాకుండా వారికి వైద్యసేవలు అందించి మందులను విరివిగా అందించాలన్నారు. పిఎస్‌ఈ పరిధిలో గర్భవతుల నమోదును ప్రత్యేకంగా చేయాలన్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చింతమాకులపల్లెలో 104ద్వారా జరుగుతున్న ఫ్యామిలీ పిజీషియన్ క్యాన్సెట్ వివరాలను ఆరా తీశారు. డాక్టర్లు శ్రీధర్, క్రిష్టల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు 232మందికి ఉద్యోగాలు

కురబలకోట, నవంబర్ 2 ప్రభాతవార్త :

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మిట్స్ విద్యార్థులు 232మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మిట్స్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న బిటెక్,ఎంసిఏ విద్యార్థులు మైండ్‌ట్రీ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 232మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారని ఆయన తెలిపారు. బిటెక్ విభాగంలో ఈసిఈ 82మంది, పీఎస్‌సి 65మంది, సిఎస్‌టి 33మంది, మెకానికల్ 17మంది, త్రిబుల్‌ఈ 19మంది, ఎంసిఏ 15మంది, సివిల్‌లో ఒక్కరు చొప్పున ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరికి ఏడాదికి గరిష్టంగా రూ.4లక్షలు వేతనం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఎంపి మిథున్‌రెడ్డిని కలసిన వైసిపి నాయకులు

రామసముద్రం, నవంబర్ 2 ప్రభాతవార్త:

రాజంపేట ఎంపి, లోకసభ ప్యానల్ స్పీకర్, లోకసభ వైసిపి పక్షనేత ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం మదనపల్లె నియోజకవర్గంలో పర్యటించారు. రామ సముద్రం మండల వైసిపి నాయకులు ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మండల అభివృద్ధిపై చర్చించారు. ఎంపిని కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, సింగిల్ విండో అధ్యక్షులు కేవశరెడ్డి, జడ్పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి, ఎంపిపి కుసుమకుమారి, వైస్ ఎంపిపి వెంకటరణారెడ్డి, కొండూరు క్రిష్ణారెడ్డి, జయరామి రెడ్డి, నంద, ప్రకాష్, ఆది, చెంబకూరు చంద్ర, గుట్టకింద చంద్ర, పాల బత్తం సుబ్రహ్మణ్యం, సుదర్శనం, సర్పంచ్‌లు ఉదయ్ శంకర్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, సుబ్బారెడ్డి, తిప్పరాజు, ఎంపిటిసి రెడ్డప్ప, కిట్ట పాల్గొన్నారు.

ఎంపిచే మినరల్ వాటర్‌ప్లాంటు ప్రారంభం

మదనపల్లె, నవంబర్ 2 ప్రభాతవార్త :

పట్టణంలోని 17వ వార్డులో మినరల్ వాటర్‌ప్లాంటును బుధవారం ఎంపి మిథున్‌రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ షమీంఅస్లాం నిర్మించిన ఉచిత వాటర్‌ప్లాంటును ఎంపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన నీటిని ఉచితంగా అందించేందుకు ఈ ప్లాంటును నిర్మించడం జరిగిందన్నారు. అదే విధంగా పట్టణంలోని ప్రజలందరికి శుద్ధిచేసిన నీటిని ఉచితంగా అందజేయడంజరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్‌లు జింకా చలపతి, నూర్‌అజాం, కౌన్సిలర్లు మొమీన్ ముబిషిరా, ఆర్‌వి.శివారెడ్డి, ఎస్‌వి.రమణ, ఖాజా, రామిశెట్టి శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

మెప్మాలో నిధుల గోల్‌మాల్‌పై నోరు మెదపరెందుకు? : ఏఐటీయూసీ

కడప ఏడురోడ్లు, నవంబరు 2, ప్రభాతవార్త:

జిల్లాలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాలో లక్షల రూపాయల నిధుల గోల్‌మాల్ (అవినీతి)పై అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదని ఏఐటీ యూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ప్రశ్నించారు. స్థానిక హోచి మన్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరులో కొంత మంది మెప్మా సీఓలతో ఆర్పీలు మిలాక్ అయి డ్వాక్రా మహిళల గ్రూపుల నుంచి లక్షల రూపాయలు గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళా సంఘాల గ్రూపులకు తెలియకుండానే కొంత మంది ఆర్పీలు సీఓలతో చేతులు కలిపి బ్యాంకుల ద్వారా రునాలు తీసుకొని వాటిని బయట వడ్డీలకు నడిపిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డ్వాక్రా గ్రూపులలో మరణించిన తొలగించిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకునే సమయంలోను, రుణాలు మంజూరు సమయంలోనూ, ఆన్‌లైన్ పేరిట, బ్యాంకు సిబ్బందికి డబ్బులు ఇవ్వాలని గ్రూపుల దగ్గర నుంచి వసూలు చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు.

పన్నులు వేయడంపై ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో ఉండదా

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

కడప ఏడురోడ్లు, నవంబరు 2, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రజలపై వివిధ రకాల పన్నులు వేస్తూ భారం మోపుతున్న ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడూ లేనివిధంగా చెత్తపై పన్ను ఆస్తులపై పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను బోర్డులపై పన్ను విధించి ప్రజలపై అధిక భారం మోపి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. అంతకు ముందు కరెంటు ఛార్జీలు పెంచి మళ్లీ ట్రూప్ అప్ ఛార్జీలంటూ వేధించారని ఆందోళన వ్యక్తం చేశారు. తెదేపా ప్రభుత్వంలో అన్ని పన్నులు ఉండేవా అని నిలదీశారు. కడప నగరానికి కూతవేటు దూరంలో పెన్నా నది ఉంటే రోజూ నగర ప్రజలకు మంచి నీరు అందించలేని స్థితి పాలకులదని ఎద్దేవా చేశారు. కొత్తగా వేస్తున్న పలు విధానాల పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వికాస్, హరి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు జిలానీబాషా పాల్గొన్నారు.

ర్యాష సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్ష దైవం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా

కడప ఏడురోడ్లు, నవంబరు 2, ప్రభాతవార్త:

దిక్కులేని వారికి దేవుడే దిక్కు అని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రత్యక్ష దైవం రాష్ట్ర సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. స్థానిక ఉప ముఖ్య మంత్రి మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్‌బాషా నివాస కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆరోగ్యశ్రీని తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే మొదటగా ప్రవేశపెట్టి లక్షలాది మందికి ప్రాణదాతగా మారడం జరిగిం దన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, అన్ని మౌలిక సదుపాయాలు కలల్పిస్తూ డాక్టర్ల కొరత లేకుండా డాక్టర్లను నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహ్మద్ షఫీ, బాలస్వామిరెడ్డి, అజ్మతుల్లా ఖాన్, రాజశేఖర్, కె.బాబు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్తు ఎస్‌ఈ

కడప ఏడురోడ్లు, నవంబరు 2, ప్రభాతవార్త:

విద్యుత్తు సమస్యల పరిష్కారంపై డయల్ యువర్ విద్యుత్తు ఎస్‌ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్‌ఆర్ జిల్లా విద్యుత్తు శాఖాధికారి మునిశంకరయ్య తెలిపారు. గంటల నుంచి 12 గంటల వరకు 08562-242457 నంబరుకు వైఎస్ ఆర్ జిల్లా విద్యుత్తు శాఖాధికారి అందుబాటులో ఉంటారు. జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులు తమ సమస్యలను డయల్ యువర్ ఎస్‌ఈకి తెలిపి పరిష్కరించుకోవాలని తెలిపారు.

గాంధీపై చేసిన వ్యాఖ్యలు వందశాతం వాస్తవం

జమ్మలమడుగు, నవంబరు 2, ప్రభాతవార్త:

టీడీపీ ఎక్సైజ్ శాఖామంత్రి జవహర్ మరికొల్లు రవీంద్రబాబు బ్రాహ్మణ సంఘాలు ఆర్యవైశ్య సంఘాలు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మార్కుడి విక్టర్ ప్రసాద్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సమతా సైనిక్ దళ్ జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం ఓబులేసు తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక సమతా సైనిక్ దళ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమిషనర్ ఛైర్మన్ గాంధీపై చేసిన వ్యాఖ్యలు నూటికి నూరు శాతం వాస్తవం అన్నారు. గాంధీ దళితులకు కమ్యూనల్ అవార్డులో (ప్రత్యేక నియోజకవర్గాలు) రామ్ సేమ్ మేక్ డోనాల్డ్ ప్రకటిస్తే, అవి గాంధీ అడగలేదా..? అన్నారు. గాంధీ పైకి చొక్కా లేని వ్యక్తిగా కనిపించినప్పటికీ లోపల మాత్రం హిందూ ధర్మాల కోసం పాటుపడి దళితులకు అన్యాయం చేయలేదని మీరు చెప్పగలరా? అన్నారు. గాంధీకి మహా త్మాగాంధీ అని గానీ, జాతిపిత అని గాని ఎవరు ఇవ్వనప్పటికీ సనాతన, మతో న్మాధులు ఆయనను ముఖస్తుతి చేస్తూ ఇచ్చుకున్నదే తప్ప ఎవరూ ప్రకటించ లేదని చెప్పారు. భారతదేశంలోని పౌరులందరికీ హక్కులను కల్పించి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కల్పించిన వ్యక్తి ఒక డా.బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. నిజమైన దేశభక్తుడు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని తెలిపారు. కార్యక్రమంలో అరవ జార్జి, మాదాపురం వెంకటరాముడు, దారా ఆమోస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ జాతీయ ఛైర్మన్ జన్మదినం

కడప ఏడురోడ్లు, నవంబరు 2, ప్రభాతవార్త:

కాంగ్రెస్ ఓబీసీ జాతీయ ఛైర్మన్ కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్ జన్మదినాన్ని బుధవారం కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఓబీసీ విభాగం జిల్లా ఛైర్మన్ చిన్న కుళాయప్ప కేక్ కోసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఓబీసీ విభాగం చాలా ముఖ్యమైనదని, బీసీలకు న్యాయం చేయాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. 1970లోనే బీసీలకు కాంగ్రెస్ విద్య, ఉద్యోగాలలో 25శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. 1994లోనే స్థానిక ప్రభుత్వాలలో బీసీలకు 34 శాతం రిజ ర్వేషన్ కల్పించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు మూల వెంకటరావు, కడప జిల్లా కాంగ్రెస్ ఓబీసీ విభాగం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఓబీసీలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ కోపూరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్య దర్శి ప్రసాద్‌గౌడ్, ఓబీసీ నగర అధ్యక్షుడు వేణుగోపాల్, సూర్యుడు పాల్గొన్నారు.

ఎంపికి సర్పంచ్‌లు స్వాగతం

**మదనపల్

ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు అర్బన్, నవంబరు 02 ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా ఎయి డెడ్ పాఠశాలల్లో పనిచే స్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఉ పాధ్యాయ సంఘాల సమ న్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివా సులురెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌బివిఆర్ జూనియర్ కళాశాలలో ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఎయిడెడ్ అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసేందుకుగాను శ్రీనివాసులురెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో 58 సంవత్సరాలకు ఉన్న పదవీ విరమణ వయసును 60 సంవత్సరాలకు పెంచడంలోను, ప్రభుత్వ అధ్యాపకులతో సమానంగా 300 రోజులు అర్ధ వేతన సెలవులను నగదుగా మార్చుకునేందుకు జీవో 90 తీసుకురావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పలు ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వంలోకి విలీనం చేసిందని, అయితే విలీనం కాని వాటి పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ప్రభుత్వంలో విలీనమైన విద్యాసంస్థల సిబ్బందికి అన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉండగా, విలీనం కాని వాటి సిబ్బందికి మాత్రం ఎటువంటి ప్రయోజనాలు దక్కడం లేదని, కావున అన్ని ఎయిడెడ్ విద్యాసంస్థల సిబ్బందికి సమాన ప్రయోజనాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 2004 తరువాత పాఠశాలల్లో విధులలో చేరిన అధ్యాపకులకు పెన్షన్ పథకం, సీపీఎస్ పథకం రెండూ వర్తించడం లేదని, వారికి కనీసం సీపీఎస్ పథకాన్ని అయినా అమలు చేస్తే భవిష్యత్తులో ప్రభుత్వం పాత పెన్షన్ పథకం అమలుచేస్తే వారికి కూడా ఆ ఫలాలు దక్కుతాయని, హెల్త్ కార్డులు అందజేయాలని, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, పదోన్నతులు కూడా ఇవ్వాలన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఎయిడెడ్ విద్యాసంస్థ లు విద్యాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాయని, కావున ఈ పాఠశాలలపై ఉ న్న వ్యతిరేక భావాన్ని తొలగించి అభివృద్ధి కొరకు సహృదయంతో ఆలోచించాలని సూచించారు.కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ రామలక్ష్మణ్ రెడ్డి, విశ్రాంత ఎంఈవో శీలం గంగన్న, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బసవయ్య, విశ్రాంత పీడీ కోటా ఓబులరెడ్డి, పిటిఎల్‌యు నాయకులు గంటా వెంకటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాదుడే బాదుడుకు అపూర్వ ఆదరణ

-మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి.నవంబర్ 02 ప్రభాతవార్త

రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ, స్పందన లభిస్తుందని రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి చెప్పారు. బుదవారం రాయచోటి పట్టణం మున్సిపాలిటి పరిధిలోని 17వ వార్డులో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యి ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతి, అక్రమాలు ప్రజలకు వివరించడం మరియు ధరల పెరుగుదల ముఖ్యంగా పెట్రోల్, డీజల్, గ్యాస్, బస్‌చార్జీలు, నిత్యావసర సరకుల ధరల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చే పలు సంక్షేమ కార్యక్రమాలు వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ముఖ్యంగా రంజాన్ తోఫా, చంద్రన్న పెళ్లి కానుక, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక వైసిపి ప్రభుత్వం తొలగించిందన్నారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టికి ఓట్లు వేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని రమేష్‌కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. వైసిపికి బుద్ధి చెప్పి టిడిపికి అధికారం ఇచ్చేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నట్లు రమేష్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాష, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, మాజీజెడ్పిటిసి సభ్యుడు నరసారెడ్డి, మురికినాటి సుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టే చలపతి, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్ట్

జమ్మలమడుగు, నవంబరు 2, ప్రభాతవార్త:

దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చలివెందుల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సలహా శిబిరాన్ని ముందుగా ప్రారంభించారు. అనంతరం ఆయన దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా గతంలో కూడా మా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశామన్నారు. అంతే కాక మహిళలకు రైతులకు వివిధ గ్రామాల ప్రజలకు దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఉచిత వైద్య సలహా శిబిరంలో డాక్టర్లు చెప్పిన సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాధి అధికంగా ఉన్న వారికి నెల్లూరు నారాయణ ఆసుపత్రి వారు ఉచితంగా వాహనాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు

దువ్వూరు, నవంబరు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలో 2020-21, 2021-22 సంవత్సరాలలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పనులపై మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. మండల పరిధిలోని చల్లబసాయపల్లె, గుడిపాడు, దువ్వూరు కానగూడూరు గ్రామాల్లో ఏపీవో రామచంద్రారెడ్డి, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు జరిగాయి. ఇందులో సామాజిక తనిఖీ బృందం సభ్యులు తాము గ్రామాల్లో పర్యటించి గత 2 సంవత్సరాల్లో చేసిన పనులను గురించి వివరించారు. పనుల్లో ఏమైనా లోపాలున్నాయి, ఉంటే ఎంత మేర ఉందని చర్చించారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు డబ్బులు సక్రమంగా అందాయా లేదా అని విచారించారు. సామాజిక తనిఖీ బృందం త్వరలో 16, 17 విడతలపై బహిరంగ వేదిక నిర్వహిస్తారని అందులో 23 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగాయా లేదా అనేది వెల్లడిస్తారన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం గ్రామ సభలు జరుగుతున్నాయని ఏపీవో తెలిపారు. ఇందులో సర్పంచ్‌లు మాబూ షరీఫ్ చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

4 నుండి 6వ తేదీ వరకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి 414వ జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారి మఠం, నవంబరు 02 ప్రభాతవార్త :

కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయం నందు ఈ నెల 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరిగే బ్రహ్మంగారి 414వ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ మరియు ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పేర్కొన్నారు. 4వ తేది శుక్రవారం ఉదయం 5గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, పారాయణం, వేద స్వస్తి, 7 గంటలకు మంగళ వాయిద్య పూర్వకంగా తీర్థనయనం, మంగళ తోరణాద్యా అలంకరణ, 9-15 గంటలకు అనుజ్ఞ గణపతి పూజ, పుణ్యాహ వచనం, మహా సంకల్పం, పంచగవ్య ప్రసనం, ఆచార్య బుద్వి గర్వణం, దీక్షాదారణ, రక్షణ బంధనం, సాయంత్రం 5 గంటలకు వేద స్వస్తి, పంచసూక్త పారాయణం, 9 గంటలకు హరికథా కాలక్షేపం, కథకులు లక్ష్మీకుమారి 10 గంటలకు దీక్షా బంధనోత్సవం, 5వ తేదీన సుప్రభాత పూజతో ప్రారంభమై ఉదయం 9 గంటలకు బ్రహ్మంగారి జయంతి, కలిశ పూజ, వాహన విశేష అర్చన, స్వామివారి శిలామూర్తికి విశేష క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఏకదశవతర 414 విశేష పూజ, స్వామివారి చూర్ణిక హోమములు, నైవేద్య మంత్ర పుష్ప, మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగములు, రాత్రి 7-30 గంటలకు శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రాత్రికి హరికథా కాలక్షేపం, స్వామివారి గ్రామోత్సవం, 6వ తేదీన ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామికి విశేష హోమములు, మండల పూజలు, శాంతి పుష్టి హోమములు, పూర్ణాహుతి, నైవేద్య మహామంత్ర పుష్ప మంగళ హారతి, ప్రసాద వినియోగములు జరుగును. స్వామివారి జయంతి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా చలువ పందిర్లు, విద్యుత్ దీపాలంకరణతో పాటు వివిధ రకాల ఏర్పాట్లను ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

తడి, పొడిచెత్తను వేర్వేరుగా అందించాలి

పులివెందుల రూరల్, నవంబరు 02, ప్రభాతవార్త :

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి చెత్తను సేకరించేందుకు వచ్చే వాహనదారులకు ప్రజలు తడి పొడి, హానికర చెత్తను వేర్వేరుగా అందించి సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్ కోరారు. పులివెందులలోని నారాయణ స్కూల్‌లో బుధవారం స్వచ్ఛత కె దోరంగ్ క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎన్జీటీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ గురించి వివరించారు. జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకుండా చెత్త సేకరించే వాహనాలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనరు నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ ఒక శనిగ్రహం

- ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 02, ప్రభాతవార్త :

రాష్ట్రానికి బీజేపీ ఒక శనిగ్రహంలా, ప్రాంతీయ పార్టీలైన వైఎస్ఆర్‌సీపీ, టీడీపీలు రాహుకేతువుల్లా దాపురించాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాల కార్యక్రమం అమలు చేస్తుందని తులసిరెడ్డి వివరించారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేకహోదా అమలు చేస్తామన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రతి అంశాన్ని అమలు చేస్తామని తెలిపారు.

పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన సదస్సు

సంబేపల్లె.నవంబర్ 02 ప్రభాతవార్త

మండల పరిధిలోని సంబేపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద పట్టు పరిశ్రమపై బుదవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసే ప్రధాన వాణిజ్య పంటలలో లాభదాయకమైనది మల్బరీ సాగు అని సిరికల్చర్ ఏడి రవీంద్ర నాథ్ పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ శాఖకు సంబందించి ప్రభుత్వ రైతులకు రాయితీలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 2022 - 23 గాను 144 ఎకరాలకు 55 మంది రైతులు నూతనంగా ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో పట్టు గూళ్ల ధర నిలకడగా ఉందని కేజి 700 రూపాయలు సరాసరి నికర ఆదాయం లభిస్తోందన్నారు. రాయచోటి డివిజన్‌లో పట్టు రైతులకు అవసరమయిన 20 లక్షల మల్బరీ మొక్కలకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గత రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి మల్బరీ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి వెంకట్రామయ్య, సాంకేతిక అధికారి సావిత్రమ్మ, టిఓ రెడ్డి నాయక్, విఏఎస్ శశికళ రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలలో నిర్లక్ష్యాన్ని వహిస్తే కఠిన చర్యలు

-కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.నవంబర్ 02 ప్రభాతవార్త

జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలలో అధికారులు నిర్లక్ష్యాన్ని వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ హెచ్చరించారు. బుదవారం కలెక్టరేట్‌లోని మినీవీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న ఇళ్ల నిర్మాణాలు ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. అన్నమయ్య జిల్లాలో మొత్తం 73,756 ఇళ్లు మంజూరుకాగా అందులో 23621 బిలో బేస్‌మెంట్ లెవల్‌లో 21302 బిఎల్, 6761 ఆర్ఎల్, 7247 ఆర్సీ దశలో ఉండగా 6274 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. ఇందులో 7750 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. జిల్లాలో 30 డేస్ కింద 1115 మందికి కొత్తగా ఇళ్లు మంజూరయ్యాయని ఇవి కూడా వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మనబడి నాడునేడు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలన్నారు. వచ్చే ఫిబ్రవరి 28 నాటికి నాడు నేడు పనులు పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్‌లు ఉపయోగంలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో స్పష్టమయిన మార్పు కనిపించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ పిడి శివయ్య, డిఈవో రాఘవ రెడ్డి, ఐసిడిఎస్ పిడి నిర్మల, ఆర్‌డబ్ల్యుఎస్ఇ ప్రసన్న కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను ఆకర్షించే విధంగా శిల్పారామాలను తీర్చిదిద్దుతాం

-రాష్ట్ర సిఈవో శ్యామసుందర్‌రెడ్డి

రాయచోటి.నవంబర్ 02 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలను ఆకర్షించే విధంగా శిల్పారామాలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర శిల్పారామాల సీఈవో శ్యామసుందర్‌రెడ్డి చెప్పారు. రాయచోటి పట్టణం సమీ పంలో శిల్పారామానికి మంజూరు చేసిన 13.18 ఎకరాల స్థలాన్ని బుదవారం ఆయన పరిశీలించారు. స్థలం అనుకూలంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త జిల్లాల్లో మొదటగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం సమీపంలో శిల్పారామం ఏర్పడబోతోందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కడప తిరుపతి శిల్పారామాలు ప్రజలను ఆకర్షిస్తూ నంబర్ 01 స్థానంలో ఉన్నాయని అనంతపూర్,కాకినాడ, వైజాగ్ పూర్తవుతున్నట్లు చెప్పారు. త్వరలో విజయ నగరం శిల్పారామం ప్రారంభం చేయనున్నట్లు ఆయన చెప్పారు. గుంటూరులో ఒక నెలలోపు పనులు పూర్తయ్యి ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాయ చోటి శిల్పారామం నిర్మాణానికి దాదాపు 5 కోట్ల రూపాయలు అవసరమవుతుం దన్నారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటయితే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని అధిక ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిల్లలకు పార్కులు, ఆట స్థలాలు, పిల్లలను ఆకర్షించేందుకు రకరకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. శిల్పారామాలలో చేతితో తయారు చేసిన వస్తువులు, ఉద్యానవనం సాంప్రదాయ, చేతి పనుల పరిరక్షణకు వాతావర ణాన్ని సృష్టించే ఆలోచనతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిల్పారామం లో చెక్క పని నగలు బట్టలు, స్థానిక చేతి పనులతో చెక్కబడిన అందమయిన సహజ పరిస్థితులలో తయారు చేసిన వస్తువులు, గ్రామీణులు రూపొందించిన కళాకృతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పులివెందులలో 9 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నట్లు శ్యామసుందర్ రెడ్డి తెలిపారు. శిల్పారామంలో ఫంక్షన్‌హాల్, షాపింగ్‌మాల్ ఏర్పాట్లు కూడా ఉంటాయన్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయం శిల్పారామం మెయింటినెన్స్ వినియోగిం చనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాయచోటి పట్టణంలోని వార్త కార్యాలయాన్ని శ్యామసుందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వార్త కార్యాలయ సిబ్బంది ఆయనను దుశ్శాలవతో సన్మానించి పూలగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మహమ్మద్, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, లయన్ శివారెడ్డి, వార్త సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలి

ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, నవంబరు 2 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం మండల పరిషత్ అధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాడు నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడులో ఎంపికైన పాఠశాలల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఆధునీకరించడం కోసం నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులను విడుదల చేస్తున్నారని, వాటిని సక్రమంగా వినియోగించుకొని పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపైనే ఉందని ఆయన తెలియజేశారు. నాడు - నేడు పనులను ఇచ్చిన సమయంలోనే పూర్తి చేయాలని, మొదటిదశ, రెండో దశలో స్కూళ్లకు నిధులు కూడ విడుదల చేశారని, వాటిని ఏవైతే అవసరమో వాటిపై కేటాయించాలన్నారు.కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, మండల ఇన్‌ఛార్జి ఎంఇఒ జయవేలు, ఎపిఎం వసుంధర, తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగం వారు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్ పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం

బద్వేలు అర్బన్, నవంబరు 02 ప్రభాతవార్త :

కార్తీక మాసం పురస్కరించుకొని పుణ్య క్షేత్రాలకు ఈ నెల 7, 14, 21 తేదీలలో కార్తీక సోమవారాలలో పంచ క్షేత్రాలకు శ్రీ కాశినాయన క్షేత్రం (జ్యోతి), భైరవకోన, సిద్దేశ్వరం, నారాయణస్వామి మఠం, నర్రవాడలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక వాహనాలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఆది, సోమవారాలలో ఏపిఎస్ ఆర్టీసి బద్వేలు డిపో నుండి త్రిలింగ క్షేత్ర దర్శనాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని, ఆదివారం ఉదయం బయల్దేరి మహానంది, ఓంకారం క్షేత్రాలు దర్శించుకొని రాత్రికి శ్రీశైలం చేరుకోవడం జరుగుతుందని, సోమవారం శ్రీశైల క్షేత్ర దర్శనం తరువాత తిరిగి బద్వేలుకు రానున్నట్లు వివరించారు. ఇందుకు గాను బద్వేలు నుండి రూ.850లు, పోరుమామిళ్ళ నుండి రూ.800లు, అదే విధంగా శ్రీ కాశినాయన క్షేత్రం, భైరవకోన, సిద్దేశ్వరం, నారాయణ స్వామి మఠం, నర్రవాడ క్షేత్రాలకు రూ.400లు బస్సు ఛార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. అంతే కాకుండా బద్వేలు నుండి రూ.1200లు, కడప నుండి రూ.1050లు, పోరుమామిళ్ళ నుండి రూ.1300లుగా నిర్ణయించడం జరిగిందని, కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పుణ్య క్షేత్రాలకు వెళ్ళదలచిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ఇసుక అక్రమరవాణాపై మెరుపుదాడి

రాయచోటి రూరల్.నవంబర్ 02 ప్రభాతవార్త

రాయచోటి మండలం గొర్లముదివీడు గ్రామ పంచాయతీలోని మాండవ్య వనదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్పీ రవికుమార్ బుదవారం మెరుపుదాడులు నిర్వహించి ఆరు ట్రాక్టర్‌లను, ఒక హిటాచిని, ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రవికుమార్ తెలియజేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ధనుంజయుడు, అధికారులు పాల్గొన్నారు.

కారు - ద్విచక్రవాహనం ఢీ

ఇరువురికి తీవ్రగాయాలు

చిన్నమండెం.నవంబర్ 02 ప్రభాతవార్త

మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామం రాయచోటి గాలివీడు ప్రధాన రహదారిలో చిన్నమండం పరిధిలోని రామాపురం గ్రామం వద్ద బుదవారం సాయంత్రం గాలివీడు వెళుతున్న ఒక టాటా సఫారీ ఏపి 04 ఎహెచ్ 6055 నంబర్ గల కారు గాలివీడు నుంచి వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ యాక్సిడెంట్ వల్ల బైక్‌లో వస్తున్న కుర్రపోతుల లక్ష్మీపతి, పూజారి వెంకటరమణ ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరినిరాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కుర్రపోతుల లక్ష్మీపతి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికే సిబిఏ పరీక్షలు

ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి

సంబేపల్లె, నవంబర్ 02 ప్రభాతవార్త :

విద్యార్థులు సామర్థ్యాలను అంచనా వేయడానికి ఆధారిత మూల్యాంకన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుదవారం సంబేపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ సిబి ఏ పరీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. సిబిఏ పరీక్షలలో ఓఎంఆర్ షీట్లను ఎలా నింపాలో మొదట విద్యార్థులకు అలవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారి భవిష్యత్తు చదువులకు పాఠశాల స్థాయిలోనే పటిష్ట పునాది పడేలా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఓఎంఆర్ షీట్లలో జవాబులు రాయడం వలన విద్యార్థులకు చిన్ననాటి నుంచే పరీక్షలు ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్

ద్విచక్ర వాహనదారుడు మృతి

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని రాజు కన్వెన్షన్ వద్ద అతిగా మద్యం తాగి బిహార్‌కు చెందిన లారీ డ్రైవర్ అతివేగంతో ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనడంతో వాహనదారుడు సుబ్బయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు అనంతరాజుపేట నివాసి అని, వయస్సు 55 ఉంటుందని అన్నారు. మృతుడు ద్విచక్ర వాహనంలో అనంతరాజుపేట నుండి కోడూరు వస్తున్న సందర్భంలో అతిగా మద్యం తాగిన లారీ డ్రైవర్ వాహనదారుని తొక్కించుకొని వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో శాశ్వత ఉభయదాతలకు ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్, నవంబరు 02 ప్రభాతవార్త :

పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో